ప్రజాశక్తి

సోమవారం 7 ఆగస్టు 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

అంతులేని ఆగడాలు

మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



జిల్లాలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు, గంజాయి తదితర మత్తుపదార్థాల సరఫరా, విక్రయం, వినియోగం నిత్యకృత్యంగా మారాయి. బహిరంగ ప్రదేశాల్లో జనసమ్మర్ధం లేని ప్రాంతాల్లో మద్యం సేవించడం పరిపాటైంది. ఇది నేరాలకు దారితీయడంతోపాటు మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, పిల్లలపై దాడులకు కారణమవుతోంది. వేర్వేరు కారణాలతో మహిళలు, యువతులు, బాలికల అదృశ్యం తల్లిదండ్రులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అదృశ్యమైన కేసుల్లో 95 శాతం మంది ఆచూకిని తెలుసుకుని వారిని తిరిగి వారితల్లిదండ్రులకు అప్పగిస్తున్నట్టు పోలీసు అధికారులు చెబుతున్నారు.

2019లో జిల్లాలో బాలికలు, యువతులు 93 మంది అదృశ్యం కాగా 90 మందిని గుర్తించారు. 2020లో 77 మందికి గాను 75 మందిని, 2021లో 134కి గాను 130 మందిని, 2022లో 147 మందికి గాను 144 మందిని గుర్తించి తల్లిదండ్రులకు, సంరక్షకులకు అప్పగించారు. 2023లో ఇప్పటి వరకు 80 మంది అదృశ్యం కాగా దాదాపు 74 మందిని గుర్తించారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు ▶ 2లో

మాచర్ల నియోజకవర్గంలోకి లోకేష్

- ఘన స్వాగతం చెప్పేందుకు భారీగా తరలివచ్చిన శ్రేణులు
- ప్రజల నుండి వినతులు స్వీకరిస్తు, హామీలిస్తూ కొనసాగిన యాత్ర

ప్రజాశక్తి - వినుకొండ, విజయపురిసౌత్



టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోకి ప్రవేశించింది. 176వ రోజైన ఆదివారం బొల్లాపల్లి మండలం జయంతి రామాపురం నుండి కొనసాగిన యాత్ర వినుకొండ నియోజకవర్గంలో ముగించుకొని మాచర్ల నియోజకవర్గంలోకి ప్రవేశించింది. కారంపూడి శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద టిడిపి మాచర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఘన ▶ 2లో



గేయాలాపనలో డాక్టర్ పురుషోత్తమరావు, మల్లిక

అలరించిన 'రఫీ సాబ్‌కె గానే' సంగీత విభావరి

ప్రజాశక్తి-తెనాలి

ప్రముఖ గాయకుడు మహ్మద్ రఫీ వర్ధంతి సందర్భంగా పట్టణానికి చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పురుషోత్తమరావు ఆధ్వర్యంలో 'రఫీ సాబ్‌కె గానే' పేరిట సంగీత విభావరి నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సంగీత విభావరిలో రఫీ ఆలపించిన తెలుగు, హిందీ ఆపాత మధురాలను డాక్టర్ పురుషోత్తమరావు, ప్రముఖ గాయని మల్లిక, గాయకులు షానవజీ ఆలీఖాన్, సైదా, శివలీల ఆలపించారు. ఆద్యంతం అహుతలను అలరించారు. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి సంగీత ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ వి.సాంబిరెడ్డి, డాక్టర్ ప్రసాదరావు, డాక్టర్ రంగారావు, డాక్టర్ సాగర్, ఆడిటర్ కామశాస్త్రి పాల్గొన్నారు.



గద్దర్‌కు నివాళి

ప్రజాశక్తి-మంగళగిరి

ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సంతాపం తెలియజేస్తూ ఆదివారం రాత్రి మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్ బాబు, కంచర్ల కాసియా, జి జానీ పాల్గొన్నారు.



మణిపూర్‌లో హింసకు నిరసనగా శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలి

మణిపూర్‌లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, క్రైస్తవులపై దాడులకు నిరసనగా క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలి నిర్వహించారు. రూరల్ గ్రామం కొలకలూరు నుంచి నందివెలుగు వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముస్లింలు సంఘీభావంగా నిలిచారు. దాదాపు రెండు నెలలుగా హింసకు పాల్పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవటం దారుణమన్నారు. అత్యధికంగా క్రైస్తవులు లక్ష్యంగా దాడులు కొనసాగుతున్నాయని, దీనికి నిదర్శనం చర్చిలను ధ్వంసం చేయడమేనని అన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమాన్ని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు చొరవ చూపి, ఆ రాష్ట్రంలో శాంతి నెలకొల్పి, ప్రజలకు, ముఖ్యంగా క్రైస్తవులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పెద్దఎత్తున ప్రార్ధనలు చేశారు. కార్యక్రమంలో దైవజనులు సురేష్, పరిశుద్ధరావు, సిహెచ్ పీటర్‌పాల్, కుమార్, చంద్రబాబు, కె.జడ్సన్, స్థానికులు ఎస్.శరత్‌వెంకయ్య, న్యాయవాది మురళీధర్, కె.నాగేశ్వరరావు, కె.దేవానంద్, డాక్టర్ కె.అబ్రహాంలింకన్, మహిళలు పాల్గొన్నారు.

అమృత భారత్ రైల్వే స్టేషన్లలో
వర్చువల్ విధానంలో ప్రధాని శంకుస్థాపన

తెనాలిలో పాల్గొన్న ఎంపి అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-తెనాలి

అమృత్ భారత్ రైల్వే స్టేషన్లుగా దేశవ్యాప్తంగా ఎంపికైన 508 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులకు సంబంధించి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ఆదివారం ప్రారంభించిన నేపథ్యంలో ఆయా స్టేషన్లలో రైల్వే అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దక్షణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో అమృత భారత్ రైల్వే స్టేషన్లుగా 11 స్టేషన్లను ఎంపి చేసిన సంగతి తెలిసిందే. వాటిలో తెనాలి రైల్వే స్టేషన్‌కూడా ఉన్న నేపథ్యంలో ప్రధానమంత్రి వర్చువల్‌గా పనులను ప్రారంభిస్తున్న కార్యక్రమాన్ని తిలకించేందుకు స్థానిక రైల్వే స్టేషన్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మురుగుడు హనుమంతరావు, తెనాలి చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానశీం పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెనాలి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.27.13 కోట్లు కేంద్రం మంజూరు చేయటం హర్షణీయమన్నారు. ఇప్పటికే స్టేషన్‌లో అవసరమైన అదనపు సౌకర్యాలపై విజయవాడ డివిజినల్ అధికారులు మెయిల్ ద్వారా చేసిన ప్రజాభిప్రాయ సేకరణ చేశారిన, తద్వారా పలు సంఘాల వారు సమస్యలు వివరించారన్నారు. భవిష్యత్‌లో రైల్వే స్టేషన్ మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో టుబాకో బోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాధబాబు, పి.రామకృష్ణ, రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

అంతులేని ఆగడాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువగానే నమోదవుతున్నా పోలీసు స్టేషన్‌లలో కేసుల నమోదు రాజకీయ నాయకుల కనుసన్నల్లో జరుగుతుందనే విమర్శ లేకపోలేదు. ఏదైనా కీలక కేసు నమోదు కావాలంటే కొంతమంది పోలీసు అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధి అనుమతి అనివార్యంగా చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో కేసు నమోదు కాకుండా రాజీలు కూడా చేపడుతున్నారు. రాజీకి అంగీకరించని పక్షంలో ప్రతిపక్షాలు, మీడియా జోక్యంతో చివరికి కేసులు నమోదయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. మహిళలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగదని భావించిన వారు నేరుగా ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా స్పందన ద్వారా స్వీకరించిన ఫిర్యాదులు 675, డయల్ 100 లేక 112 ద్వారా వచ్చినవి 512, పోలీసు సేవా యాప్ ద్వారా 17, సైబర్ మిత్ర తో 43 ఫిర్యాదులు అందాయి. గంజాయి ప్రభావంతో నేరాలు జరగడం లేదని పోలీసు అధికారులు చెబుతున్నా మత్తులోనే చాలా ఘటనలు జరుగుతున్నాయి. తాడేపల్లిలో అంధురాలిపై దాడి చేసి హత్య చేసిన ఘటనలో నిందితుడ్ని పట్టుకున్నా అతని మత్తులోనే నేరానికి పాల్పడినట్టు ఆరోపణలు వచ్చాయి. గుంటూరులో నిశిరాత్రి వేళ ఇద్దరు మైనర్లు మత్తులోనే వాణిజ్య సముదాయాలపైదాడి చేసి ఇద్దరు వాచ్‌మెన్లను హత్య చేసిన ఘటన తీవ్ర సంచలనం కలిగించింది. మత్తులో ఎవరిపైనా దాడులు, అఘాయిత్యాలకు పాల్పడే తత్వం పెరుగుతోంది. గతేడాది పెదకాకాని మండలం తక్కెళ్లపాడు జరిగిన వైద్య విద్యార్థినీ తపస్వీ హత్య కేసు జిల్లాలో కలకలం రేపింది. గంజాయికి సంబంధించి 2020లో 51 కేసుల్లో 169 మందిని అరెస్టు చేసి 728.50 కిలోలు సీజ్ చేయగా 2021లో 70 కేసులు నమోదు చేసి 182 మందిని అరెస్టు చేసి 3613.66 కిలోల గంజాయి సీజ్ చేసినట్టు తెలిపారు. 2022లో 68 కేసులు నమోదు అయ్యాయి. 154 మందిని అరెస్టుచేశారు. 260 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు జిల్లాలో 293 గంజాయి కేసులలో 670 మందిని అరెస్ట్ చేసి 4158 కిలోల గంజాయిని, 9.084 లీటర్ల గ్రాముల ద్రవరూప గంజాయిని పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భారీగా గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నా సాగుదార్లను గుర్తించి మూలలను నిరోధించడంలో యంత్రాంగం విఫలం కావడం వల్ల సరఫరా, విక్రయాలు, వినియోగం యధాతథంగా కొనసాగాయి.

మాచర్ల నియోజకవర్గంలోకి లోకేష్

(మొదటి పేజీ తరువాయి)

స్వాగతం పలికారు. భారీ గజమాలతో లోకేష్‌ను సత్కరించారు. అనంతరం లోకేష్‌వెంట నడుచుకుంటూ కారంపూడి తండా వద్ద ఏర్పాటు చేసిన బస ప్రాంతానికి వెళ్లారు. స్వాగతం పలికిన వారిలో నాయకులు మాజీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, జీవి ఆంజనేయులు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, చిరుమామిళ్ల మధుబాబు ఉన్నారు. స్వాగతం పలికేందుకు టిడిపి శ్రేణులు భారీఎత్తున తరలివచ్చారు.

ఇదిలా ఉండగా వినుకొండ నియోజకవర్గం పాదయాత్రలో రైతులు డ్రాగన్ ఫ్రూట్, మిర్చి, ఇతర కూరగాయలతో చేసిన గజమాలను రైతులు లోకేష్‌కు వేసి సత్కరించారు. పంటకు మద్దతు ధర లేక ఎదుర్కొంటున్న సమస్యలను లోకేష్ దృష్టికి తెచ్చారు. లోకేష్ మాట్లాడుతూ పంట నష్టపోయి అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వ్యవసాయంపై అవగాహన లేని సీఎం కారణంగా రాష్ట్ర రైతు ఆత్మహత్యల్లో దేశంలోనే మూడో స్థానంలో నిలిచిందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే నాగార్జున సాగర్ కాల్వలను ఆధునీకరణ చేపట్టి చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందిస్తామన్నారు. వరికపూడిశెల నిర్మాణాన్ని చేపట్టి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పంటలకు మద్దతు ధరలిస్తామన్నారు. మేళ్ల వాగు గ్రామస్తులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తండాలకు రవాణా సౌకర్యం లేక చదువుపై విద్యార్థులు ఆసక్తి చూపడం లేదని, 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న బొల్లాపల్లికి వెళ్లడానికి విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, హాస్టళ్లు ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల గ్రామాల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. హాస్టళ్ల ఏర్పాటుకు తగిన స్థలం కూడా అందుబాటులో ఉందన్నారు. తాము అధికారంలోకి రాగానే విద్యార్థులకు చేరువగా పాఠశాలలు, హాస్టళ్లు ఏర్పాటు చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. పాఠశాలల విలీనం పేరుతో జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల 4 లక్షల మంది గ్రామీణ విద్యార్థులకు చదువు దూరమైందని అన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోవటం, ఫ్లోరైడ్ ప్రభావం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పేద రైతులకు మంజూరు చేసిన భూములకు యాజమాన్య హక్కులు కల్పించి, చుక్కల భూములకు చట్టబద్ధంగా క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. దీర్ఘకాలంగా ఉన్న అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తూ చుక్కల భూముల సమస్యలు కూడా శాశ్వతంగా పరిష్కరించే బాధ్యత తీసుకుంటానని అన్నారు. ఇదిలా ఉండగా వికలాంగులూ తరలివచ్చి తమ సమస్యలను లోకేష్‌కు వివరించారు. విద్యార్థుల సమస్యలపై రాష్ట్ర విద్యార్థి యువసేన అధ్యక్షులు సంపెంగుల రవికుమార్ వినతిపత్రం ఇచ్చారు. వినుకొండ నియోజకవర్గం సరిహద్దు వరకు జీవి ఆంజనేయులు, ఆయన భార్య లీలావతి పాదయాత్రలో పాల్గొన్నారు.



కారంపూడి శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న బ్రహ్మారెడ్డి

ధర్మకర్తల మండలి సమావేశం

ప్రజాశక్తి-తెనాలి



పెదకాకాని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం ధర్మకర్తల మండలి సమావేశం ఆదివారం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో భక్తుల సౌకర్యార్థం ఆలయంలో కల్పించాల్సిన మరికొన్ని అదనపు సౌకర్యాలపై చర్చించారు. దాతల సహకారంతో పవిత్రోత్సవాలు నిర్వహించాలని, శ్రావణ మాసంలో భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు, ప్రతి శుక్రవారం సహస్ర దీపాలంకరణ సేవను నూతనంగా ప్రారంభించటం, గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారికి ఆలయంలో నూతనంగా ‹త్య కళాణం నిర్వహించుట, శ్రావణ మాసంలో సహస్ర చండీయాగం, జూలై 2023 జమాఖర్చులపై చర్చించి ఆమోదించినట్లు ఆలయ సహాయక కమిష నర్ ఎన్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సమావేశంలో పాలక మండల సభ్యులు గజ్జల సుబ్బాయమ్మ, కె.శివరత్నాలు, టి.రవీంద్ర, కె.శివ నాగేశ్వరమ్మ, జి.మల్లేశ్వరరావు, జి.వెంకటరావు, సిహెచ్ అరుణ, పి.వెంకటేశ్వరరావు, ఎం.జ్యోతి, కె.పార్వతి, పి.లక్ష్మినారాయణ వరప్రనసాద్, ఎక్స్ అఫీషియో సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న మేయర్

నగరాభివృద్ధికి సహకరించాలి : మేయర్

ప్రజాశకి-గుంటూరు

నగరాభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక 12వ డివిజన్‌లో చందనబ్రదర్ నుండి కోడి గుడ్డు సత్రం వరకు రోడ్డుకు ఇరువైపులు డ్రెయిన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించి, ఆక్రమణలపై, స్థానిక పెద్దలు, అధికారులతో కలిసి చర్చించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం అవుతున్నాయని, ఆ బాధలను తొలగించటానికి చందన బ్రదర్స్ నుండి కోడిగుడ్డు సత్రం వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా రూ.1.30 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులతో డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆ రోడ్లు ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుందన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని రోడ్డుపై ఉన్న ఆక్రమణలు తొలగించి వ్యాపారులకు, స్థానికంగా ఉండే ప్రజలకు ఇబ్బందులు లేకుండా డ్రెయిన్లు నిర్మిస్తామని తెలిపారు. నిర్మాణ సమయంలో స్థానిక ప్రజల సహాయ సహకారాలు ఎంతో ముఖ్యమని, నగరాభివృద్ధి కోసం ప్రజలూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఖాజా మొహిద్దీన్‌చిష్టి, ఈఈ కోటేశ్వరరావు, ఎసిపి అజయ్ కుమార్, అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగనిరోధక శక్తి

ప్రజాశక్తి-గుంటూరు



బిడ్డలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని 20వ డివిజన్‌లో నల్లచెరువులో, అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంలో పాల్గొని గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తల్లిపాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కరోనా సమయంలో కూడా పెద్ద వారికే ఎక్కువగా కరోనా వచ్చిందని, పిల్లలు ఎవరూ కరోనా బారిన పడలేదని చెప్పారు. దానికి ప్రధాన కారణం వారిలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. గర్భిణులు 3వ నెల నుండి, బిడ్డపుట్టి 6 నెలలు వచ్చే వరకు తల్లీబిడ్డలకు వైయస్ఆర్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ కిట్లను అందజేస్తుందని వివరించారు. కార్యక్రమంలో వైసిపి 19, 20 డివిజన్ల అధ్యక్షులు టెంట్ హౌస్ బాబు, కంతేటి శ్యాం శేఖర్, కవిత, ఫాతిమా, రియాజ్, అంగన్ వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్, చంద్రబాబు మాట్లాడిన ప్రదేశంలోనే లోకేష్ సభ



స్థలాల పరిశీలనలో యరపతినేని శ్రీనివాసరావు

- యరపతినేని శ్రీనివాసరావు
- పలు ప్రాంతాల్లో స్థల పరిశీలన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఎన్‌టిఆర్, చంద్రబాబు బహిరంగ సభల్లో మాట్లాడిన ప్రదేశంలోనే నారా లోకేష్ బహిరంగ సభనూ నిర్వహిస్తామని గురజాల మాజీ ఎమ్మెల్యే యారపతినేని శ్రీనివాసరావు అన్నారు. యువగళం పాదయాత్రతో టిడిపి శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంటుందని చెప్పారు. లోకేష్ పర్యలన నేపథ్యంలో మండలంలోని జానపాడు, జూలకల్లు, పిడుగురాళ్ల పట్టణ ప్రాంతంలో స్థలాలను ఆయన ఆదివారం పరిశీలించారు. సభ వద్ద ఏర్పాట్లపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. పాదయాత్ర విజయవంతానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి నాయకులను కమిటీలుగా ఏర్పాటు చేయాలన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో జానపాడు రోడ్డు వద్దగల కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఎదురుగా ఉన్న స్థలంలో 50 వేల మందితో సభా నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. గతంలో ఎన్‌టిఆర్, చంద్రబాబు నాయుడు అదే గ్రౌండ్ నందు సభ ఏర్పాటు చేశారని, నేడు లోకేష్ యువగళం పాదయాత్ర చేస్తూ వస్తున్న సందర్భంగా అక్కడే సభను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పిడుగురాళ్ల చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా యువగళం కార్యక్రమం నిర్వహించబోతున్నామన్నారు. సోమవారం సాయంత్రం పిడుగురాళ్ల మండలం జూలకల్లుకు లోకేష్ చేరుకుంటారని, రాత్రి బస అనంతరం మంగళవారం ఉదయం పాదయాత్ర మొదలవుతుందని, పిడుగురాళ్లలో సాయంత్రం సభ ఉంటుందని వివరించారు. సభ అనంతరం పట్టణ శివారు ప్రాంతంలోని వలల గార్డెన్స్‌లో రాత్రి బస ఉంటుందన్నారు. పాదయాత్ర, బహిరంగ సభకు గురజాల నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా తరలిరావాలని కోరారు.



మాట్లాడుతున్న వేర్‌హౌస్ మేనేజర్ శ్రీనివాసరావు

ఘనంగా గిడ్డంగుల సంస్థ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - తెనాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక వేర్ హౌసింగ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి వేర్ హౌసింగ్ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన వహించి మాట్లాడారు. 1958 ఆగస్టు 5న కేవలం నాలుగు శాఖలతో ఆవిర్భవించిన వేర్ హౌసింగ్ ప్రస్తుతం 127 శాఖలకు విస్తరించిందన్నారు. రైతులు పండించిన పంటలను గోడౌన్స్ లో భద్రపరచుకుని, ధర వచ్చిన తర్వాత అమ్ముకోవడం, అలాగే నిల్వ ఉంచిన సరుకు విలువపై బ్యాంకుల ద్వారా రుణం పొందడం వంటి సౌకర్యాలను వేర్ హౌసింగ్ కార్పొరేషన్ అందిస్తున్నట్లు వివరించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కంఠనాధరెడ్డి, చైర్మన్ కరిముల్లా షేక్ ఆధ్వర్యంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. కార్పొరేషన్‌లో ఎపిడబ్ల్యూఒఎస్ సాఫ్ట్వేర్ అందుబాటులోకి వచ్చిందన్నారు. సిబ్బంది ప్రతి ఒక్కరికి ఎన్ఐపిహెచ్ఎం, ఐజిఎంఆర్ఐ వంటి సాంకేతికతపై శిక్షణను ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.రాంబాబు, హెచ్ అండ్ టి కాంట్రాక్టర్ కె.కనకరత్నం, విశ్రాంత జనరల్ మేనేజర్ బి.సాంబశివరావు, విశ్రాంత వైర్ హౌసింగ్ మేనేజర్ టి.నాగేశ్వరరావు, ఎంఎస్ జగన్మోహన్‌రావు, కొల్లా వీరయ్య, ఎ.హరిబాబు, కార్మికులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - తాడేపల్లి

పట్టణంలోని కత్తులపేట, అమరారెడ్డి నగర్ ప్రాంతాల్లో పోలీసుల ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గంజాయి, మద్యం అమ్మకాల నేపథ్యంలో సిఐ శేషగిరరావు ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి ఇళ్లల్లో తనిఖీలు చేశారు. ద్విచక్ర వాహనాల రికార్డులను పరిశీలించారు. గంజాయి, మద్యం అక్రమ విక్రయాలపై సమాచారం ఉన్నవారు పోలీసులకు చెప్పాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్థానికులతో అన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన



చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్ఐలు వినోద్, శ్రీనివాస్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వివా స్కూల్లో చేనేత దినోత్సవం

ప్రజాశక్తి - తెనాలి

పెదకాకాని మండలం నంబూరులోని వివా స్కూల్‌లో చేనేత దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. మంగళగిరికి చెందిన చేనేత వస్త్ర తయారీదారులు, విక్రేతలు ప్రదర్శనలో పాల్గొన్నారు. వస్త్ర తయారీ విధానాన్ని విద్యార్థులకు కెకె, టెక్ 7 హ్యాండ్లూమ్ సంస్థల ప్రతినిధులు వివరించారు. మంగళగిరి, పోచంపల్లి, కళంకారి వస్త్రాల తయారీ, వాటి మధ్య వ్యత్యాసాలను గురించి అవగాహన కల్పించారు. తయారీకి ఉపయోగించే పరికరాలు రాట్నం, బొంగరం, అచ్చు నాడి తదితర పరికరాలను నేత కార్మికుడు క్రాంతి కుమార్ ప్రదర్శించారు. విద్యార్థులు చేనేత ప్రదర్శనను విశేషంగా తిలకించారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని



చేనేత ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

ఉపాధ్యాయులు చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కెఎస్ రావు, ప్రిన్సిపల్ చదలవాడ సరళ, ఐబి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సుమేధా హైస్కూల్లో యోగాసన పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు : యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమేధ స్కూల్లో జరిగిన జిల్లాస్థాయి యోగాసన పోటీలు ఘనంగా జరిగాయి. ఈ పోటీలను ముఖ్య అతిథులుగా ఇంటెలిజెన్స్ డిఎస్పి గోలి లక్ష్మయ్య, స్థానిక కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి, సుమేధా స్కూల్ చైర్మన్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై సంయుక్తంగా ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న అందరికీ డిక్షనరీలను సుమేధ స్కూలు చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. పోటీల్లో సబ్ జూనియర్ బాలికల విభాగంలో పి.భార్గవి, ఎ.రాజేష్, జూనియర్ బాల బాలికల విభాగంలో పి.వెంకటత్రివేణి, సిఎం.విశ్వనాథరెడ్డి, సీనియర్ బాల, బాలికల విభాగంలో ఎ.ఉదయ్‌కుమార్, టి.తేజస్విని ప్రథమ బహుమతులు పొందారు. జిల్లా స్థాయిలో గెలిచిన వారు రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు అర్హతను సాధించారని, వీరు రాష్ట్ర స్థాయిలో కూడా మంచి ప్రదర్శన కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అసోసియేషన్ అధ్యక్షులు ఆళ్ల రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.మల్లికార్జునరావు ఆకాంక్షించారు. న్యాయనిర్ణేతలుగా యోగా గురువులు తేజస్వి, బి.సురేష్, సి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎ.సుజాత వ్యవహరించారు.



కానిస్టేబుల్ రమేష్ బాబుకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి తెనాలి : వైకుంఠపురం ఆలయం కేశఖండనశాలలో దోపిడీకి ప్రయత్నించిన దొంగలను అడ్డుకునే క్రమంలో తీవ్రంగా గాయపడి గుంటూరు రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వన్‌టౌన్ కానిస్టేబుల్ రమేష్‌బాబును ఎమ్మెల్యే శివకుమార్ ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లను కోరారు. ఆయన వెంట పట్టణ వన్‌టౌన్ సిఐ కె.చంద్రశేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.హరిప్రసాద్ తదితరులున్నారు.

బిజెపిని గద్దె దించకుంటే ప్రమాదం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించటానికి కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, అన్ని రంగాల ప్రజలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. విజయవాడలో ఈనెల 9న నిర్వహించే కార్మిక సంఘాల మహా ధర్నా విజయవంతం కోసం పట్టణంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఆర్‌టి సెంటర్ నుండి బయలుదేరిన ర్యాలీ భాస్కర్ సెంటర్, చౌత్ర సెంటర్, మెయిన్ బజార్, గడియార స్తంభం, కళామందిర్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిజెపి విధానాలతో కార్మికులు, ప్రజలు అసంతృప్తి చెందారని, దీన్ని పక్కదారి పట్టించటానికి మత చిచ్చు పెడుతున్నారని, మణిపూర్, హర్యానాలో అల్లర్లు ఇందులో భాగమని వివరించారు. మైనార్టీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, ఇతర సామాజిక తరగతులపై సంఘపరివార్ శక్తులు నిత్యం దాడులు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను, సహజ వనరులను కార్పొరేట్లకు దోడిపెడుతున్నారని, వ్యవసాయాన్నీ వారికే అపపగించేయందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇదే జరిగితే దేశంలో ఆహార సంక్షోభం వస్తుందని హెచ్చరించారు. ప్రజలకు సబ్సిడీలను ఎత్తేస్తున్న ప్రభుత్వం కార్పొరేట్లకు మాత్రం పన్ను రాయితీలు ఇస్తోందని విమర్శించారు. అయితే రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు కేంద్రానికి వంతపాడుతున్నారని, విద్యుత్, మున్సిపల్, సహకర, విద్య, రవాణ రంగాల్లో ప్రమాదకర సంస్కరణను కేంద్రం ఆదేశాలతో రాష్ట్రంలోని వైసిపి అమలు చేస్తూ ప్రజలపై భారాలు వేస్తోందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుంటే మరోవైపు ప్రజల ఆదాయాలు పడిపోతున్నాయని, ఇదే విధానాలను కొనసాగిస్తే దేశం అదోగతి పాలువుతుందని, అందుకే మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి, సిఐటియు, ఇతర ప్రజా సంఘాల నాయకులు ప్రతాపరెడ్డి, పి.వెంకటేశ్వర్లు, ఎన్.రామసుబ్బాయమ్మ, టి.బాబురావు, పి.రామారావు, జి.భగత్‌సింగ్, స్థాలిన్, ఎం.విల్సన్, ఫైరోజ్, బి.భగత్‌సింగ్, ఎం.వెంకటేశ్వర్లు, జి.నాగయ్య, చెంచయ్య, ఎ.పోతురాజు, ఎన్.శివకుమార్ పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం కోసం పేటలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో ప్రారంభంలో మాట్లాడుతున్న పి.వెంకటేశ్వర్లు



సమీక్షలో మాట్లాడుతున్న పల్నాడు కలెక్టర్ శివశంకర్

ఓటర్ల సర్వేపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఓటర్ల జాబితా రూపకల్పనలో ఆరోపణలు, అవకతవకలకు తావు లేకుండా అధికారులు పని చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. అన్ని రాజకీయ పార్టీల వినతులను పరిగణలోకి తీసుకొని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 సంక్షిప్త ఓటర్ల జాబితా సర్వేపై ఇఆర్వోలు, ఎఇఆర్వోలతో కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ ఆదివారం సమీక్షించారు. సర్వే తీరు, క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు అడిగి పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణ అధికారులుగా కొనసాగుతున్న వారు నిష్పక్షపాతంగా పనిచేయాలని, సర్వేను త్వరగా పూర్తిచేసి నివేదించాలని అన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డిఆర్ఒ వినాయకం పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న యువకులు

చదువుకు తగ్గ ఉపాధి అవకాశాలు చూపాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - క్రోసూరు

యువత చదువుకు తగ్గట్టుగా ఉద్యోగావకాశాల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని భారత ప్రజాతంత్ర యువజన సఘం (డివైఎఫ్ఐ) జిల్లా నాయకులు టి.ఉదయ్ భాస్కర్ అన్నారు. మండలంలోని దొడ్లేరులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కానిస్టేబుల్స్ ఉద్యోగాలు భర్తీ చేయాలని డివైఎఫ్ఐ పోరాటం చేసిన నేపథ్యంలో నోటిఫికేషన్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. పాఠశాలల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అభ్యర్థులూ నిరీక్షిస్తున్న క్రమంలో సత్వరమే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులను రెగ్యులర్ చేయడంతోపాటు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ అంశంపై పోరాటాల్లో నిరుద్యోగులు, యువత కలిసి రావాలని కోరారు. విద్యార్థులు, యువతను పెడదోవ పట్టిస్తున్న, నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ అంతం కోసం డివైఎఫ్ఐ పోరాడుతోందని, అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను, ప్రజలను చైతన్య చేయడానికి ప్రత్యేక కార్యక్రమం చేపడుతోందని తెలిపారు. అనంతరం డివైఎఫ్ఐ గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కోటేశ్వరరావు, కార్యదర్శిగా మనీమనోజ్‌శాస్త్రి, సభ్యులు ఎన్నికయ్యారు. గోపి, కుమార్ పాల్గొన్నారు.

అమృత్ భారత్ పథకానికి మూడు స్టేషన్లు ఎంపిక

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

అమృత్ భారత్ పథకం ద్వారా రైల్వేలో మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమృత భారతి స్టేషన్ స్కీం కింద రేపల్లె, తెనాలి, పిడుగురాళ్ల రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, రైల్వే అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఒక్క డీఎస్సీ ఇవ్వని ప్రభుత్వం

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - రెంటచింతల



ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులతో లక్ష్మణరావు

రాష్ట్రంలో 25 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. బిఇడి, డిఇడి పూర్తి చేసిన 5 లక్షల మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం నిరీక్షిస్తున్నారని, అయినా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేదని విమర్శించారు. మండల కేంద్రమైన రెంటచింతలలోని యుటిఎఫ్ కార్యాలయానికి ఆదివారం వచిచన ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 10,200 మంది ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం 2014 జూన్ రెండు నాటికి ఐదేళ్ల సర్వీసు నిండి ఉండాలనే నిబంధన పెట్టడం వల్ల 4 వేల మంది నష్టపోయారని చెప్పారు. 1998 డీఎస్సీకి సంబంధించి 6,800 మంది గాను 4,072 మందికి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇవ్వడం వల్ల మిగతా వారంతా నిరాశతో ఉన్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 350 కేజీబీవీల్లో పనిచేస్తున్న సిఆర్‌సి వాళ్లకు మినిమం టైం స్కేల్ ఇస్తామని చెప్పి కేవలం 23 శాతమే జీతం పెంచారన్నారు. రెంటచింతలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో తీర్మానం ప్రతిపాదించి వెంటనే అమలు చేయాలన్నా పట్టించుకోలేదని ఆవేదన వెలిబుచ్చారు. పల్నాడులో ఉన్నత విద్యాభివృద్ధికి పీజీ సెంటర్ ఏర్పాటు అవసరమని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ వెంట యుటిఎఫ్ మండల అధ్యక్షులు జాన్ విజయరాజ్ కుమార్, గౌరవాధ్యక్షులు డాక్టర్ చిన్నమ్మ, నాయకులు ఓర్సు సాగర్‌బాబు, సాల్మన్‌రాజు నాసరయ్య, మల్లికార్జున, జోష్పిన, ప్రతాప్, ఇతర ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

ప్రజాశక్తి - రెంటచింతల : వెనకబడిన పల్నాడు ప్రాంతంలో అక్షరాస్యతా శాతం 58 శాతమే ఉందని, దీన్ని అధిగమించడానికి ఎల్‌ఆర్ ఫౌండేషన్ లాంటి స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపడం అభినందనీయమని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. విశ్రాంత హెచ్ఎం ఎం.లక్ష్మారెడ్డి రెండో వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో 'అభ్యసన లోపాలు గుర్తించడం ఎలా?' అనే అంశంపై ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ఇంత కీలకమైన విద్యా బోధనలో జాగ్రత్తలు అవసరమని చెప్పారు. అనంతరం 8 మంది జెడ్‌పి పాఠశాలల ఉపాధ్యాయులకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎల్‌ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నారై ఎం.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ శ్రీసుధా, ఎంబి చిన్నమ్మ, సాల్మన్‌రాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దళితులపై దాడుల కట్టడిలో ప్రభుత్వాలు విఫలం

- దేవాదాయ భూములను దళితులకివ్వాలి
- జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి : కెవిపిఎస్



సమావేశంలో మాట్లాడుతున్న జి.రవిబాబు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

దళితులపై దాడుల కట్టడిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు అన్నారు. సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు సిహెచ్.నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన స్థానిక పివి భవన్లో ఆదివారం జరిగింది. రవిబాబు మాట్లాడుతూ దళితుల ఓట్ల మీద ఉన్న ప్రేమ వారి రక్షణపై పాలకులకు లేదన్నారు. కేంద్రంలో మనువాద ఆర్‌ఎస్‌ఎస్ భావజాలతో నడిచే బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా దళితుల మీద దాడులు తీవ్రంగా పెరిగాయని, అదే పద్ధతిలో రాష్ట్రంలోనూ దళితులకు, దళితుల భూములకు రక్షణ కరువైందని విమర్శించారు. దళితులకు రక్షణగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చడం కోసం మోడీ ప్రభుత్వం యత్నిస్తుండగా దాన్ని ప్రతిఘటించి దళితులు సాధించుకున్న రక్షణ కల్పించే విధంగా అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. దళితుల మీద దాడులు చేసే వారికి భయం లేకుండా పోయిందని, అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడానికి జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత, గిరిజనులకు ఉన్న గృహ వినియోగ విద్యుత్ పాత బకాయిలను రద్దు చేయాలన్నారు. దళితులను చైతన్య పరచడానికి కెవిపిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఐక్య ఉద్యమాన్ని రూపొందిస్తున్నట్లు చెప్పారు. కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ దళితులు ఎదుర్కొంటున్న సామాజిక ఆర్థిక సమస్యలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలన్నారు. దేవాదాయ భూములను దళితులు సాగు చేసుకోవటానికి ఇవ్వాలని, కౌలు రైతుల్లో సగానిపైగా ఉన్నటువంటి దళితులకు గుర్తింపు కార్డులు, రైతు భరోసా, పంట నష్టపరిహారాలు తదితరాలను వర్తింపజేసేలా చట్టానికి సవరణలు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు ఎం.విల్సన్, ఎం.ఆంజనేయులు, ఎం.క్రీస్తురాజు, బి.రామారావు, వి.పద్మ, సుమ, ఇనుముక్కల, ఏసు కుమార్, బి.చిన్న వెంకటస్వామి, కె.ధర్మరాజు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

రాజధానిలో పారిశుద్ధ్య కార్మికుల భారీ ర్యాలీ - సభలో నాయకులు

ప్రజాశక్తి - తుళ్లూరు : పెండింగ్ జీతాలు, పిఎఫ్ చెల్లించాలని, మణిపూర్ లో శాంతియుత వాతావరణం కల్పించాలని కోరుతూ ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు.18 నెలల పెండింగ్ పీఎఫ్, మూడు నెలల పెండింగ్ జీతాలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ, నాయకులు ఎం రవి, ఎం భాగ్యరాజు ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం నుంచి తులసీ థియేటర్ వరకు ర్యాలీ జరిపారు. అనంతరం కార్యాలయం వద్ద రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్షురాలు చెరుకూరి సుశీల అధ్యక్షతన జరిగిన సభలో వై నేతాజీ మాట్లాడారు. రాజధాని లోని పారిశుద్ధ్య కార్మికులను శ్రమ దోపిడీ చేస్తూ, వారికి ఇచ్చే అరకొర జీతాలు కూడా సక్రమంగా చెల్లించకుండా, ఇబ్బందులు పెట్టడం ఏ మాత్రం సరైనది కాదన్నారు. నాలుగో నెల జరుగుతున్నా ఇప్పటివరకు కార్మికులకు జీతాలు చెల్లించకుండా సిఆర్‌డిఎ అధికారులు ఏజెన్సీ లేదనే సాకు చెబుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అదేమని అడిగిన కార్మికులపై బెదిరింపులకు దిగటం రాజధానిలోని ప్రజలందరూ ఖండించాలని నేతాజీ కోరారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ఎవరూ చేయని విధులు నిర్వర్తించే పారిశుద్ధ్య కార్మికులకు 18 నెలలుగా పిఎఫ్ చెల్లించకపోవడం చట్టరీత్యా నేరమని అన్నారు. తక్షణం కార్మికుల మూడు నెలల పెండింగ్ జీతాలు 18 నెలల పిఎఫ్ చెల్లించకపోతే విజయవాడ సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రాజధాని పారిశుద్ధ్య కార్మికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకునేందుకు సిఐటియు అండతో పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. రాజధాని కార్మికుల పోరాటాలకు సిఐటియు గుంటూరు జిల్లా కమిటీ అండదండగా నిలుస్తుందని అన్నారు. మణిపూర్ లో బిజెపి ప్రేరేపిత హింసకాండను ప్రజలందరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి కుట్రల వల్ల మణిపూర్ రాష్ట్రం తగలబడి పోతుందని, రావణ కాష్టంగా మారిందని, శాంతిభద్రతలను కాపాడటంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ కార్మికులపై సి ఆర్ డి ఎ కోఆర్డినేటర్ నరసింహారావు వేధింపులు మానుకోవాలని కోరారు. ధర్నాలు చేస్తే తప్పు చేసిన పనికి కార్మికులకు జీతాలు చెల్లించరా అని ప్రశ్నించారు? కార్మికులను మీ ఇష్టమైన పనులకు ఉపయోగిస్తారా అని మండిపడ్డారు. ఇప్పటికైనా రాజధానిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు సి ఆర్ డి ఎ అధికారులు చిత్త శుద్ధితో వ్యవహరించకపోతే ఎంతటి పోరాటాలకైనా వెనకాడేది లేదని అన్నారు. కార్యక్రమంలో రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు, ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులు పేరం బాబురావు, కోటేశ్వరరావు, సుఖవేణి, బుజ్జి, జోజి, శేషయ్య, వీరాంజనేయులు, రమణ, జ్యోతి, మరియమ్మ, దేవి, అరుణ్, సుజాత, మార్తమ్మ, అరుణ, నరసయ్య, శేషగిరి, రాణి,హేమ, గురవమ్మ, రూతమ్మ, మార్తమ్మ, శివపార్వతి, వీర్లంకమ్మ పాల్గొన్నారు.



తుళ్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

బహిరంగ సభలో మాట్లాడుతున్న నేతాజీ


మిర్చి రైతులకు మెరుగైన సౌకర్యాలు

ఎగుమతిదారులకు ప్రోత్సాహం - ఆదాయం పెంపునకు కృషి : యార్డు చైర్మన్ నిమ్మకాయల

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరు నుంచి ఇతర దేశాలకు మిర్చి ఎగుమతులను ప్రోత్సహించి రైతులకు మెరుగైన ధరలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజ నారాయణ తెలిపారు. గుంటూరు మిర్చి యార్డులో రైతులకు సౌకర్యాలు పెంచుతామన్నారు. మిర్చి యార్డు ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పెంపునకు కృషి చేస్తామన్నారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

మార్కెట్ ద్వారా ప్రస్తుతం అందుతున్నసేవలు?

గుంటూరు మిర్చి యార్డు ఆసియాలోనే అతిపెద్ద యార్డుగా పేరొందింది. రైతులకు విశ్రాంతి భవనం, తాగునీరు, గిడ్డంగులు, ఆక్షన్ ఫ్లాట్ పారాలు, రైతు సరుకు భద్రత, ఇంటర్ నెట్ వసతి, నాణ్యతా పరీక్ష లేబరేటరీలు, బిడ్డింగ్‌హాల్స్, ఇతర దేశాల నుంచి వ్యాపారుల కొనుగోలు, మెరుగైన రహదారులు, బ్యాంకు వసతి, నిరంతర విద్యుత్‌సరఫరా రైతులకు తగిన రక్షణ కల్పిస్తున్నాం. రైతులకు సీజన్‌లో ఉచిత భోజన వసతి కల్పిస్తున్నాం. ఇంకా మరిన్ని సౌకర్యాలు పెంచే ఒదుకు కృషి చేస్తు న్నాం. రాబోయే రోజుల్లో మరిన్ని మార్పులు తీసు కువస్తాం. యార్డు లో రైతుల కోసం త్వరలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వ హిస్తాం. భోజనం అమలు విషయంలో మరింత నాణ్యత పెంచుతాం. మార్కెట్ యార్డ్ లో జరిగే ప్రతి ఒక్క లావా దేవి లు బ్యాంక్ లు ద్వారానే జరిగేలా చూస్తాం.





యార్డులో కమిషన్ ఏజెంట్లు, ఎగుమతి దారులు?

కమిషన్ ఏజెంట్లు వల్ల రైతులకు ఎటువంటి సమస్యలు రాకుండా చూస్తాం. యార్డులో 683 మంది కమిషన్ వ్యాపారుస్తులు, 395 మంది ఎక్స్‌పోర్టు వ్యాపారులు ఉన్నారు. వీరి ద్వారానే యార్డులో లావాదేవీలు జరుగుతున్నాయి.

గుంటూరు మార్కెట్ యార్డు విస్తరణ?

గుంటూరు మార్కెట్ యార్డు ప్రస్తుత స్థలం 49.73 ఎకరాల్లో ఉంది. 1969 నుంచి ఇదే స్థలంలో యార్డు కొనసాగుతోంది. గతంలో ఈ యార్డును విస్తరించాలన్న ప్రతిపాదనలు ఉన్నా అమలు జరగలేదు. ప్రజా ప్రతి నిధులు, ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. యార్డులో ఏయే సౌకర్యాలు కల్పించాలన్న అంశంపై కూడా పాలకవర్గంలోచర్చించి నిర్ణయం తీసుకుంటాం.

ప్రస్తుతం యార్డుకు వస్తున్న ఆదాయం?

మిర్చి యార్డుకు సెస్సు రూపంలో ఏటా రూ.9వేల కోట్ల వరకు ఆదాయం వస్తుంది. 2021-22లో రూ.8039.33 కోట్లు, 2022-23లో రూ.9036.76 కోట్లు, 2023-24లో ఈ ఏడాది జూన్ వరకు రూ.2971.91కోట్లు ఆదాయం వచ్చింది.రికార్డు స్థాయిలో ఎగుమతులు జరుగుతున్నాయి.

ఈనామ్ ద్వారా జరుగుతున్న క్రయ విక్రయాలు?

ఈనామ్ విధానం 2017లో అమలులోకి వచ్చింది. 2021-22లో రూ.6537.76 కోట్లు, 2022-23లో రూ.7920.50 కోట్లు, 2023-24లో జులై 27 వరకు రూ.2759.49 కోట్ల టర్నోవర్ జరిగింది.

నేడు ఉండవల్లి గుహల వద్ద రైతు సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లి , తాడికొండ

కొండవీటి వాగులో తూటికాడ, గుర్రపుడెక్క, మేటలను తొలగించాలని కోరుతూ తాడేపల్లి మండలం ఉండవల్లి గుహల వద్ద సోమవారం ఉదయం 10గంటలకు రైతు సదస్సు ప్రారంభం అవుతుందని గుంటూరు జల్లా రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జొన్నా శివశంకర్, కంచుమాటి అజయ్‌బాబు ఆదివారం తెలిపారు. సభను జయప్రదం చేయాలని కోరుతూ ఉండవల్లిలో జొన్నా శివశంకర్, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, శేఖర్, ఎర్రపేరు, దాసరి నాగయ్య, పెద్దిశెట్టి వీరాస్వామి, నరేష్‌రెడ్డి, వల్లబాపురం వెంకటేశ్వరరావు, బంగారయ్య తదితరులు సదస్సు జయప్రదం చేయాలని ప్రచార కార్యక్రమం నిర్వహించారు. తాడికొండలో లో రైతు సంఘీహం మండల నాయకులు కనగాల పూర్ణచంద్ర రావు, చింతల భాస్కరరావు, పులి డేవిడ్, రాజు రైతులు పాల్గొన్నారు.తాడికొండలో సదస్సు జయప్రదం చేయాలని నాయకులు కంచుమాటిఅజయ్ కుమార్, కనగాల పూర్ణచంద్ర రావు, చింతల భాస్కరరావు, పులి డేవిడ్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కొండవీటి వాగు ముంపు వలన నాలుగు మండలాల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. పంట చేతికి వచ్చే సమయానికి వరదలు వచ్చి రైతులు పంట నష్టపోతున్నరన్నారు. ఈ ముంపు వలన గతంలో ప్రాణ నష్టం కూడా జరిగిందని గుర్తు చేసారు. గత ప్రభుత్వం హయాంలో సీతా నగరం వద్ద నాలుగు మోటార్లు ఏర్పాటు చేసి వరదలు వచ్చినప్పుడు మోటార్ల సాయంతో కృష్ణా నదిలోకి నీటిని తరలించడం జరిగిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొండవీటి వాగు నిండి తూటుకాడ, గుర్రపుడెక్క అక్కడక్కడ వేసిన మేటల వలన నీటి ప్రవాహానికి ఆటంకంగా మారి లోతట్టు ప్రాంతాలు, వ్యవసాయ భూములు, కొన్ని రోడ్లు, ఈ వర్షపు నీటికి మునిగిపోయి భారి నష్టాలకు రైతులు గురి అవుతున్నారు. అలాగే నీరు నిల్వ ఉండటం వలన రంగు మారి దుర్వాసన వస్తుంది. దోమలు పెరిగి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి వెంటనే కొండవీటి వాగులోని గుర్రపుడెక్క, తూటికాడ, మేటవేసిన మెరకలను తొలగించి కొండవీటి వాగు ముంపు ప్రాంత రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవలసిందిగా కోరారు. కార్యక్రమంలో మంగళగిరి, తాడికొండ, తాడేపల్లి తుళ్లూరు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


తాడికొండలో రైతులతో మాట్లాడుతున్న కె అజయ్‌కుమార్


ఉండవల్లిలో రైతులతో మాట్లాడుతున్న జొన్నా శివశంకర్

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగాధిపతి

జి.అనితకు గౌరవ పురస్కారం

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య డాక్టర్ జి. అనితకు ఉత్తమ ప్రజా సంబంధాల విభాగ ఆచార్యులుగా పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్ లోని పబ్లిక్ రిలేషన్ ఫౌండేషన్ సంస్థ హైదరాబాద్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సి.వి. నరసింహారెడ్డి, సి.రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయ విద్యా అధ్యాపకురాలిగా, ప్రజా సంబం ధాల రంగాల్లోనూ రాణిస్తున్న ఆచార్య అనితను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య స్వరూపరాణి, వివిధ కళాశాలలు, వివిధ విభాగాల ఆచార్యులు అభినందించారు.




బైక్ ర్యాలీలో నాయకులు,కార్మికులు

మోడీ హయాంలో కార్మిక చట్టాలు నిర్వీర్యం

సిఐటియూ, ఎఐకెఎస్ ఆధ్వర్యంలో కార్మికుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలి : కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిన కార్మిక శాఖ అధికారాలకు ప్రభుత్వం కళ్ళెం వేసిందని, ఫలితంగా వారి సమస్యలు పరిష్కారం కావటంలేదని సిఐటియూ జిల్లా నాయకులు కె.బాబుప్రసాద్ అన్నారు. సిఐటియూ, ఆల్ ఇండియా కాసాన్ సభ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు పట్టణంలో కార్మికులు ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాబుప్రసాద్ మాట్లాడుతూ మోదీ హయాంలో కార్మిక చట్టాలు నిర్వీర్యమైపోయాయన్నారు. కార్మిక శాఖ నిర్వీర్యంమైందని, కార్మికులకు సంబందించి ఏ సమస్యనూ పరిష్కరించలేని స్థితిలో కార్మిక శాఖ తయారైందన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులకు కనీస వేతనాలు అమలు కాక, సకాలంలో జీతాలందక, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలోనే వారి సర్వీసులు కొనసాగుతున్నాయన్నారు. వారి సమస్యలపై అఖిలభారత స్థాయిలో నిర్వహిస్తున్న ర్యాలీకి మద్దతుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ రుణాలు సకాలంలో అందించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్‌వలి, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.సాంబశివ రావు, ఆర్.వెంకటేశ్వర్లు, నాగార్జున, డి.శ్రీను, రవిశంకర్, చిట్టి, ఏడుకొండలు పాల్గొన్నారు.

గద్దర్ లేని లోటు పూడ్చలేం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా గొంతుక,ప్రజా గాయకుడు, నిరంతరం పేద ప్రజల అభ్యున్నతి కోసం తన ఆట,పాట,మాటలతో కోట్లాదిమంది ప్రజలను జాగృతులను చేసిన గద్దర్ మృతికి జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు. 2010 వరకు నక్సలైట్ ఉద్యమంలో విప్లవబాటను బట్టి వర్గ పోరాటానికి చేయూతనిచ్చారని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని పలు ఉద్యమాలకు కేంద్రబిందువుగా నిలిచారని గుర్తు చేశారు. దళిత, గిరిజన,బలహీన వర్గాల పీడిత ప్రజానీకానికి అండగా జీవితాంతం నిలిచిన మహనీయుడని జానపదాలతో ప్రజలను ఆలోచింపజేసిన ప్రజానాయకుడు గద్దర్ అని పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక నిర్వహించిన అక్షరాస్యత ఉద్యమానికి,సారా వ్యతిరేక ఉద్యమానికి అండగా నిలిచారు. దాదాపు ఐదు దశాబ్దాల పాటు నిరంతరం పేద ప్రజలకు మద్దతుగా నిలిచిన గద్దర్ మరణం తెలుగు రాష్ట్రాల పేద ప్రజలకు తీరని లోటు అన్నారు.



గ్రామాల్లో టిడిపి నాయకుల పర్యటన

ప్రజాశక్తి-పెదకూరపాడు

ఈ నెల 9,10 ,11,12 తేదీలలో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర పెదకూరపాడు నియోజకవర్గంలో జరగనుంది. ఆదివారం ఈ సందర్భంగా పెదకూరపాడు మండల అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు లింగంగుంట్ల, పొడపాడు, ముస్సాపురం, పాటిబండ్ల గ్రామాల్లో పర్యటించారు. పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయా గ్రామ కమిటీలను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి జి.బాబురావు , బి.ఆంజ నేయులు, బి.గోపాలరావు, వి.అప్పారావు, మిలిటరీ మౌలాలి, ఎం.సాగర్ పాల్గొన్నారు.



పాఠశాలకు బ్లూటూత్ స్పీకర్ బహూకరణ

ప్రజాశక్తి - క్రోసూరు

ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్, పూర్వ విద్యార్థి తాను చదువుకున్న బాలమర్రు పాఠశాలకు తన వంతు సాయం చేశారు. రూ.15 వేల విలువ చేసే బ్లూటూత్ స్పీకర్‌ను ఆదివారం నాడు బహూకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు టి.శరత్ కుమార్ మాట్లాడుతూ కోరిన వెంటనే పాఠశాలకు బ్లూటూత్ స్పీకర్‌ను ఇచ్చిన ఆమెకు అభి నందనలు తెలిపారు.శారద మాట్లాడుతూ తన ప్రాథమిక విద్యాభ్యాసం ఈ పాఠశాలలోనే జరిగిందని, చిన్ననాటి స్మృతులు గుర్తుకొస్తున్నాయని అన్నారు. ఈ పాఠశాలకు తన వంతు సాయం చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుమల రెడ్డి, పిచ్చయ్య , నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మొక్కుబడి తీర్చుకున్న ఎమ్మెల్యే దంపతులు

ప్రజాశక్తి- పెదకూరపాడు

మండలంలోని గారపాడులో గంగాలమ్మ తల్లి మొక్కుబడి తీర్చుకునే కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే శంకరరావు దంపతులు ఆదివారం పాల్గొన్నారు. అందుకూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకురాలు శావ పద్మ కూడా మొక్కుబడి తీర్చుకున్నారు.

సమైక్యతతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - మేడికొండూరు

ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల ముస్లింల సమైక్యత సమావేశం స్థానికంగా ఆదివారం జరిగింది. ముస్లిం కమ్యూనిటీలో పేద, నిరుపేద కుటుంబాలను గుర్తించి విద్య అభివృద్ధికి , వైద్య సహాయం, ఆడపిల్లల పెళ్ళి చేయలేని కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు, ముస్లింల సమైక్యత దోహదపడాలని కార్యక్రమం కన్వీనర్ ఫిరంగిపురానికి చెందిన మిల్లు బాబు అన్నారు.ముస్లింలు అన్ని రంగాలలో అభివృద్ధితోపాటు తమ సంపాదనలో కొంత పేద ముస్లింలను గుర్తించి వారి అభ్యున్నతికి ఆర్థిక తోడ్పాటు అందించే విధముగా ముస్లింల అభివృద్ధి చేసే విధంగా తీర్మానించారు.

ప్రత్యామ్నాయం లేక జాగారం!

- నాలుగు రోజులుగా విద్యుత్ శాఖ ఉద్యోగుల సమ్మె
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకే విధులు
- రాత్రి సమయాల్లో కరెంట్ పోతే అవస్థలే
- అధికారులు స్పందించాలని ప్రజల వినతి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

నియోజకవర్గం, పట్టణంలోని విద్యుత్ శాఖ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను ప్రభు త్వం పరిష్కరించకపోవడంతో వారు సమ్మెబాట పట్టి నాలుగురోజులు దాటింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు మాత్రమే విధులు నిర్వ హిస్తామని చెప్పి విద్యుత్ శాఖ ఉద్యోగులు నోటీసులు కూడా ఇచ్చారు. విధులు నిర్వహించే సమయంలో కాకుండా ఆ తర్వాత కనుక విద్యుత్ సరఫరాలో ఆటంకం కలిగినా వారు స్పందించే పరిస్థితి లేదు. దీంతో, .రాత్రి సమయాల్లో కరెంట్ ఫీజ్ పోయినా,



లోడ్ ఎక్కువై ట్రాన్స్‌ఫార్మర్ పేలి విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడితే కనుక పట్టణ వాసులు, ముఖ్యంగా స్లమ్ ప్రాంతాల్లో నివసించే వారికి నరకమే. జాగారం చేయాల్సిందే. ఒకవైపు దోమలు, మరోవైపు ఉక్క పోతతో వారికి నిద్ర పట్టని పరిస్థితి. మరు సటి రోజు పనులకెళ్ల లేక నానా అవస్థలు పడుతున్నామని పట్టణం లోని రాగన్నపాలెం, ఆది ఆంధ్రా క్రిస్టియన్ కాలనీ, ఈస్ట్ మాలపల్లె, రూట్ డైక్‌మన్ నగర్‌కాలనీ, వైఎస్సార్ కాలనీ, క్రిష్ణారెడ్డి డొంక వాసులు చెబుతున్నారు. ఆయా కాలనీల్లో సుమారు పదిహేను వేల నుంచి పద్దెనిమిది వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. విద్యుత్ సరఫరా ఆగితే ఇన్వర్టర్లు వినియోగించే ఆర్థిక స్థోమత తమకు లేదని, దోమల బారిన పడకుండా దోమ తెరలు కూడా లేవని చెబుతున్నారు. నాలుగు రోజుల నుంచి మున్సిపాలిటీ వారు కనీసం దోమల నివారణకు ఫాగింగ్,బ్లీచింగ్ చల్లిన దాఖ లాలు లేవని అంటున్నారు. పసిపిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు ఇబ్బంది తప్పట్లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ వారు ప్రత్యామ్నాయం చూడాలని, సచి వాలయ విద్యుత్ ఉద్యోగులను అయిన వినియోగించాలని కోరుతున్నారు. స్లమ్ ప్రాంతాల్లో ఫాగింగ్ చేయించి, బ్లీచింగ్ చల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మల్లాదిలో కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - అమరావతి

మండల పరిధిలోని మల్లాదిలో రూ.15 లక్షల ఎంపి లాడ్స్ నిధులతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఎస్సీ కాలనీలో సామాజిక అవసరా లకు, ప్రజలకు ఎక్కువగా ఉపయోగపడే కమ్యూ నిటీ హాల్ నిర్మాణంపై స్థానికులు హర్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు భవిరి శెట్టి హనుమంతరావు, క్రోసూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ వెంపా జ్వాల లక్ష్మీనరసింహారావు తోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే శంకరరావు తదితరులు



కోల్డ్‌స్టోరేజ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కోల్డ్ స్టోరేజ్ పనుల పరిశీలన

నాబార్డు నిధులతో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సహకారంతో అమరావతి మండలం 14వ మైలు-ఉంగుటూరు మధ్య నిర్మిసున్న కోల్డ్ స్టోరేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం పరిశీలించారు. 95 వేల బస్తాల నిల్వ సామర్థ్యం గల ఈ కోల్డ్‌స్టోరేజ్‌ను రూ.9.75 కోట్లతో నిర్మిస్తున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, చొరవ చూపి, నిధులు మంజూరు చేయించి, త్వరితగతిన కోల్డ్ స్టోరేజ్ ని పూర్తిచేస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెబుతున్నట్లు రైతులు తెలిపారు.

మణిపూర్ హింసపై పికెఎస్ నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

మణిపూర్‌లో కుకీ, నాగా ఆదివాసీలపై జరుగుతున్న మారణకాండను ఖండిస్తూ ప్రగతిశీల కార్మిక సమాఖ్య గుంటూరు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నల్లచెరువు కమ్యూనిస్టు బొమ్మల సెంటర్ నుండి హిందూ కాలేజీ సమీపంలోని పూలే విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించి, పూలే విగ్రహానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పికెఎస్ నగర కార్యదర్శి ఎన్.పోతురాజు మాట్లాడుతూ మణిపూర్ మారణకాండకు బాధ్యత వహిస్తూ బిజెపి ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ, హెూంమంత్రి అమిత్‌షా డైరెక్షనలో సంఘపరివార్ శక్తులు హిందూ మైతీలను రెచ్చగొట్టి, సైన్యం సహకారంతో కుకీ, నాగా ఆదివాసీలపై దాడులకు పాల్పడటమే కాకుండా మహిళలను నగ్నంగా ఊరేగించి ఆపై వారిపై అత్యాచార హత్యలకు పాల్పడటం సిగ్గు చేటన్నారు.కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు, కెఎన్‌పిఎస్ జిల్లా కార్యదర్శి కె.నాగేశ్వరరావు, పికెఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ముందే గుర్తిస్తే నివారణ సులభం

కేన్సర్‌పై అవగాహన సభలో డాక్టర్ శంకర్ మహదేవ్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో కేన్సర్ వ్యాధిపై ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సభలో ప్రముఖ ఆంకాలజిస్ట్, న్యూక్లియర్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ శంకర్ మహదేవ్ పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి ముఖ్యంగా ధూమపానం, కైనీ, మద్యపానము వలన వస్తుందని, కొన్ని సందర్భాల్లో వంశ పారంపర్యంగా వస్తుందని చెప్పారు. ఈవ్యాధి తీవ్రతను బట్టి 4 దశలు ఉంటాయని, సర్జరీ, కీమో థెరపి, రేడియోథెరపి, ఇమ్యునోథెరపి, టార్గెటెడ్ థెరపి లాంటి చికిత్సా విధానాలు అనుసరిస్తారని అన్నారు. కేన్సర్ వ్యాది సంక్రమించిన వారు భయపడకుండా సరైన వైద్యుని వద్దకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. స్త్రీలలో రొమ్ము కేన్సర్, సర్వైకల్ కేన్సర్ సాధారణంగా చూస్తున్నామని వైద్యంతో ఇవి తగ్గిపోతాయన్నారు. రాని వారు కూడా మూడేళ్లకోసారి స్క్రీనింగ్ పరీక్షలు చేయిచుంకోవాలని సూచించారు. ప్రోస్టేట్ కేన్సర్ మగవారిలో మాత్రమే వస్తుందన్నారు. అన్ని అవయవాలకూ కేన్సర్ వచ్చే అవకాశం ఉందని, కానీ కొన్నింటికే స్క్రీనింగ్ టెస్ట్‌లు ఉంటాయని చెప్పారు. హెపటైటిస్-బి, సిలు ఎక్కువ కాలం మన శరీరంలో ఉన్నా అది కేన్సర్‌గా మారే ప్రమాదం ఉందని, గుట్కా ఎక్కువగా వాడితే బుగ్గ కేన్సర్ వస్తుందన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, నచ్చే ఆహారాన్ని కాక ఆరోగ్యాన్ని ఇచ్చే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. మన శరీరంలో ఎక్కడైనా గడ్డ ఉండి, అది నొప్పి లేకపోతే అది కేన్సర్ కావచ్చని తెలిపారు. పది సంవత్సరాలకు ఒకసారి కొలనోస్కోపి చేయించుకుంటే పెద్దప్రేగు కేన్సర్‌ను నివారించవచ్చన్నారు. కేన్సర్ వ్యాధి గ్రస్తునికి ధైర్యం కూడా ఒక మందు అని, అధైర్యపడితే మరింత త్వరగా మరణిం సంభవించ వచ్చన్నారు. కేన్సర్ నాల్గవ దశకు చేరుకుంటే కష్టమేనని చెప్పారు. రసాయనిక ఎరువులతో పండించిన ఆహార ఉత్పత్తులు వాడటం వల్ల, బాగా కాగిన నూనెలో మళ్లీ, మళ్లీ వేయించిన ఆహార పదార్థాలు తినటం వల్ల కూడా కేన్సర్ వస్తుందన్నారు.స్త్రీలో సర్వైకల్ కేన్సర్ రాకుండా చిన్న వయసులో టీకా వేయించుకోవాలని సూచించారు. సభకు అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించగా, సభలో సంస్థ సీనియర్ సభ్యులు సాయిరాం, ప్రొఫెసర్ రత్నారావు, నరసింహారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శంకర్ మహదేవ్‌ను సత్కరించారు.



మాట్లాడుతున్న డాక్టర్ మహదేవ్

రాజ్యాంగాన్ని కాపాడదాం

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగాన్ని కాపాడదామని, సిపిఎం శ్రేణులు అంబేద్కర్ విగ్రహాల ముందు ప్రతిజ్ఞ చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. పట్టణ కమిటీ సమావేశం ఆదివారం కొట్టె కరుణాకరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ బిజెపి పాలనలో రాజ్యాంగానికి ప్రమాదం వచ్చి పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మనుస్మృతుని తీసుకు రావడానికి ఆర్ఎస్ఎస్ ప్రోద్బలంతో మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. అంతేగాక రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని, రాష్ట్రాలకు ఉన్న అధికారాలను పరిమితం చేసి రాజ్యాంగ హక్కులను కూడా నిరాకరిస్తోందని ధ్వజ మెత్తారు. బిజెపి పాలనలో దళితులు, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.

మణిపూర్‌లో మూడు నెలల నుంచి హత్యలు, మహిళలపై అత్యాచారాలు, గృహ దహ నాలు, లూటీలు జరుగుతున్నా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మణిపూర్ పాపం ముమ్మాటికీ బిజెపిదేనన్నారు. ఇప్పటికైనా ఆ రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించి ప్రజలను కాపాడాలని కోరారు. మరోపక్క నిత్యావసరాలతో పాటు పెట్రోల్, గ్యాస్, విద్యుత్ ఛార్జీలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లి పట్టణంలో ఆరు వేల మందికి ఇళ్లస్థలాలు, పట్టాలు ఇస్తానన్న ప్రభుత్వ హామీని వెంటనే నిలబెట్టు కోవాలని కోరారు.

సమావేశంలో పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, దొంతి టండ్డి శ్రీనివాసకుమారి, వేముల దుర్గారావు, ఎస్.ముత్యాలరావు, డివి భాస్కరరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, వై.బర్నబస్ పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ నూతన మండల కమిటీ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు మండల ఎస్ ఎఫ్ ఐ కమిటీ 13 మంది సభ్యులతో ఎన్నికైంది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కమిటీ అధ్యక్ష,కార్యదర్శులుగా ఎ.అఖిలేష్, ఎండి జావీద్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షు లుగా షేక్ ఆరిఫ్, జడ్ పవన్, సహాయ కార్యదర్శులుగా ధనుష్ ,తరుణ్, ఆర్య తదితరులు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. పొన్నూరు పట్టణంలోని విద్యార్థుల సమస్యలపై పనిచేసేందుకు ఎస్ఎఫ్ఐ మండల కమిటీ నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా సంక్షేమ హాస్టల్‌కు వసతులు కల్పించడంతో పాటు విద్యాహక్కు చట్టాన్ని పక్కనపెట్టి ఆదివారాలు, సెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహించే వారిపై ఉద్య మించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా నాయకులు ఎస్‌కె సమీర్ విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణానికి చెందిన వి.పుష్పశ్రీ ఇంటర్ మీడియట్ ఎంపిసి ఫలితాల్లో 856 మార్కులు సాధించింది. ఉన్నత చదువుల నిమిత్తం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ.30 వేలు ఆమె కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ జెసిఎస్ కన్వీనర్ ఇ.డేవిడ్‌రాజు, సిహెచ్.దుర్గారావు, ఎ.యాకోబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపి మోపిదేవి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

వైసిపి రాజ్యసభ సభ్యులు, బాపట్ల జిల్లా అధ్యక్షులు మోపిదేవి వెంకటరమణకు 59వ జన్మదినం సందర్భంగా ఆయనకు పలువురు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. రేపల్లెలోని ఆయన నివాసంలో ఆదివారం పొన్నూరు పట్టణ వైసిపి నాయకులు ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ నాజర్ రాజధాని డెవలపర్స్ ఖయ్యూం, ఏఎంసీ చింతలపూడి మురళీకృష్ణ, షేక్ మౌలాలి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మంచాల కృష్ణబాబు, షేక్ నాగూర్‌లు ఆయనను కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. పుష్ప కిరీటాన్ని అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ నాజర్ మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ప్రజలకు అండగా నిలబడాలని తెలిపారు.



కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం



వ్యకాస మహాసభలో జెండాను ఎగురవేస్తున్న చిత్రం

ప్రజాశక్తి - దుగ్గిరాల

కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల మేరకు వ్యవసాయ కార్మికులకు ఒక్కొక్కరికి రెండు ఎకరాల భూమిని కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతూ ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని టర్మరిక్ అసోసియేషన్ హాలులో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మంగళగిరి నియోజకవర్గ 22 మహాసభ జరిగింది. ఈ సభకు యార్లగడ్డ శివయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ కోనేరు రంగారావు సిఫార్సులను ప్రభుత్వం చీకటి గదికే పరిమితం చేసిందని విమ ర్శించారు. వ్యవసాయ కార్మికులకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలని, వారి హక్కులను కాపాడాలని కోరారు. అం దుకు వ్యవసాయ కార్మికులను సమన్వయ పరిచి ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించి, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలన్నారు. అనంతరం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్న తిరుపతయ్య మాట్లాడారు. సభలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు. కార్య దర్శి చిన్ని సత్యనారాయణ, వ్యకాస మాజీ కార్యదర్శి జె. జాన్‌బాబు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ ఎవరి సొత్తూ కాదు





మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బి.ఇంద్రాణి, హాజరైన విద్యార్థినీవిద్యార్థులు

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రతివిద్యార్థిలో ఏదో ఒక టాలెంట్ దాగి ఉం టుందని, దాన్ని వెలికితీయడమే తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని అరవింద హైస్కూల్ ప్రిన్సిపల్ బి.ఇంద్రాణి అన్నారు. ఆదివారం అమరావతి ఐకాన్ ఫంక్షన్ హాల్లో జరిగిన సుల భతరంగా ఇంగ్లీషు నేర్చుకుందాం, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై మాస్టర్ పాగోలు రాజు (ఎంఎ పిహెచ్‌డి) విద్యా ర్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఇంద్రాణి మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్ ఎవరి సొత్తు కాదని, దానిన ఒడిసి పట్టుకుని విద్యార్థినీ విద్యార్థులు పైకి రావాలని, ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు.మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉంటున్న విద్యార్థులకు మెరిట్‌పై శిక్షణ ఇచ్చేందుకు మంగళగిరి-తాడేపల్లి బాలోత్సవం ఈ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మాస్టర్ పాగోలు రాజు మాట్లాడుతూ మాతృభాషలో రాణిస్తేనే ఇంగ్లీషులోనూ రాణిస్తారని చెప్పారు. సులభతరంగా ఇంగ్లీషు నేర్చుకుందాం, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ఐదు గంటల పాటు ఆయన నడిపిన క్లాసు విద్యార్థులను ఆలోచింప జేసింది. అమరావతి ఐకాన్ ఫంక్షన్ హాల్ విద్యార్థులతో నిండిపోయింది. బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఇంగ్లీషు అవసరమైనా అమ్మ భాషకు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బాలోత్స వం నిర్వాహకులు యడ్ల బాలకృష్ణ, ఈదర రాజశేఖర్, రియాజ్ బాష, సురేంద్ర, నాగరాజు, వై.సుబ్బారావు, షితిజ, పిఇటి రమేష్, పిన్నమనేని విజయ, కాట్రగడ్డ స్వరూపరాణి పాల్గొన్నారు.

తాడికొండ సీటును మాదిగలకు కేటాయించాలి

మాజీ సర్పంచ్ నూతక్కి నవీన్ కుమార్



ప్రజాశక్తి - తాడికొండ

రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తాడికొండ సీటును తెలుగు దేశం పార్టీ తరపున పోటీ చేసే అవకాశం మాదిగలకు కేటా యించాలని తాడికొండ మాజీ సర్పంచ్ నూతక్కి నవీన్ కుమార్ అధిష్టానాన్ని కోరారు. స్థానిక ఎస్సీ కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నవీన్ కుమార్ మాట్లాడుతూ 1979 నుండి తాడికొండ ఎస్సీ నియోజకవర్గంగా ఉందన్నారు 1983లో టిడిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి నేటి వరకూ తాడికొండ సీటును మాలలకు కేటాయిస్తూ మాదిగలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. మాదిగ ఓటర్లు అధికంగా ఉన్నప్పటికీ టిడిపి తమను చిన్నచూపు చూస్తోందని అన్నారు. జిల్లాలో ఈసారి రెండు స్థానాలను మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు మేకల అనిల్,నూతక్కి దేవదాసు, కొలికెపూడి బుల్లయ్య ఆరుమళ్ళ పూర్ణ చందు పల్లెవాసులు పాల్గొన్నారు.

కోనేరులో లభ్యమైన నాణేలపై విచారణ చేయాలి

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పెదకోనేరులో లభ్యమైన బంగారం, రాగి నాణేలపై సిబిఐ, విజిలెన్స్ విచారణ చేయాలని టిడిపి నాయకులు మునగపాటి వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లభ్యమైన బంగారం, రాగి వస్తువులు సింగల్ గా దొరకవు అని బిందెలో గాని, పెట్టెలో ఉండవచ్చునని పేర్కొన్నారు. ఎన్నో వందల సంవత్సరాల నాటి చరిత్ర ఉందని అన్నారు.



వడ్డేశ్వరంలో తోపుడు బండ్లు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన ఇద్దరు చిరు వ్యాపారులకు రెండు తోపుడు బండ్లను ఆదివారం ఉదయం వైసిపి వడ్డేశ్వరం గ్రామ నాయకులు చిరు వ్యాపారులకు అందజేశారు. అద్దె బండ్లపై చిరు వ్యాపారం చేసుకునే తమకు అడిగిన వెంటనే సహాయం చేసిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి, జాజం ఎంకోజి, అమతపూడి నాగదేవి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కత్తిక రాఘవరావు, గొడవర్తి శ్రీనివాసరావు, కత్తిక మల్లికార్జునరావు పాల్గొన్నారు.



చిరు వ్యాపారులకు చేయూత

ప్రజాశక్తి-మంగళగిరి

ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో మంగళగిరి పట్టణంలో చిరు వ్యాపారాలు చేసుకునే ఐదుగురికి తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లను అందజేశారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో వీటిని అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మల్లేశ్వరరావు, ఎస్ సునీత, ఎం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పాలన చేతగాని సిఎం ఎక్కడ ఉంటే ఏంటి?

కాంగ్రెస్ ఎస్సి సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ మెండెం కోటేశ్వరరావు



ప్రజాశక్తి - తుళ్లూరు

పదేపదే విశాఖ వెళుతున్నానని సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రక టించడం ద్వారా ప్రజలకు ఏం సంకేతమిస్తున్నారని కాంగ్రెస్స్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ మెండెం కోటేశ్వరరావు ప్రశ్నించారు. పాలన చేతగాని సిఎం ఎక్కడ ఉన్నా రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు.ఆదివారం తుళ్లూరులో విలేకరులతో మాట్లాడుతూ,అమరావతి ప్రాంత వాసులను అభద్రతకు గురి చెయ్యాలన్న దురాలోచనతో మాటి మాటికి విశాఖ వెళుతున్నానని అంటున్నారని,సిఎం మాటలను ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు.ప్రతి పండుగకు విశాఖ వెళుతున్నానని అనడం,మంత్రులతో చెప్పించడం మానుకోవాలన్నారు.జగన్మోహన్ రెడ్డి ఇడుపులపాయలో ఉన్నా లోటస్ పాండ్ లో ఉన్నా.. వేల కోట్లతో నిర్మించుకున్న బెంగళూరులోని ప్యాలెస్ లో ఉన్నా తమకేమి అభ్యంతరం లేదన్నారు. అమరావతి రాజధానిని అంగుళం కూడా కదల్చలేరని అన్నారు. ఆర్ - 5 జోన్ పై కోర్టు తీర్పుతో చేష్టలుడిగి సిఎం,మంత్రులు పిచ్చి ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు.ఎన్నికలు ముగిశాక జగన్ మోహన్ రెడ్డి సిఎం పదవి పోగొట్టుకొని ఇంటికి పోక తప్పదన్నారు.

హింసపై మహిళల పోరుయాత్ర

నేడు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో పర్యటన
జయప్రదానికి నాయకుల పిలుపు

దేశంలోనూ, రాష్ట్రంలోనూ మహిళలు, చిన్నారులపై హింస రోజురోజుకు పెరిగిపోతుంది.భ యానక పరిస్థిల్లో మహిళలు జీవనం గడిపేలా పాలకుల విధానాలున్నాయి. వీటి నుండి బయట పడాలి. అందుకే ఐద్వా హింసపై మహిళల పోరుయాత్ర ప్రారంభించింది. 'చేయి చేయి కలుపుదాం- హింసలేని సమాజం నిర్మిద్దాం' మద్యం, మత్తు పదార్థాలను రాష్ట్ర ప్రభుత్వం నియంత్రించాలి. హింస నివారణకు ప్రభుత్వం నిపుణులతో కమిషన్ ఏర్పాటు చేయాలి. అని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో చేపట్టిన 'హింసపై మహిళల పోరుయాత్ర' సోమవారం పల్నాడు, గుంటూరు జిల్లాల్లో పర్యటించనుంది. జులై 28 న ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి ప్రభావతి, డి రమాదేవి ఆధ్వర్యంలో రెండు జాతాలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్, విశాఖ నగరం ఎల్ఐసి కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహం నుండి ప్రారంభమైన రెండు జాతాలు రాష్ట్ర వ్యాపితంగా పర్యటిస్తున్నాయి. 8వ తేదీన విజయవాడలో పోరుయాత్ర ముగింపు సందర్భంగా బహిరంగ సభ నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాపితంగా వీరికి మద్దతు వెల్లువెత్తుతుంది. పోరు యాత్ర గుంటూరు, పల్నాడు జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా పలువురు మహిళలు యాత్రకు సంఘీభావం తెలుపుతు తమ అభిప్రాయాలను తెలియజేశారు.

(ప్రజాశక్తి - గుంటూరు)

మద్యాన్ని నిషేధించాలి

షేక్.రంజాన్‌బి, ఐద్వా పల్నాడు జిల్లా అధ్యక్షులు.



మద్యాన్ని నియంత్రించాలని మహిళా సంఘాలు, మహిళలు ఎప్పటి నుండో పోరాడుతున్నారు. మద్యం రేట్లు పెంచితే మద్యం తాగే వారి సంఖ్య తగ్గుతుందని, మద్య నియంత్రణ సాధిస్తామని ఈ ప్రభుత్వం చెప్పింది. కానీ ఆచరణలో ఇది ఎక్కడా అమలు కావట్లేదు. మద్యానికి బానిసైన వారు ఇంకా ఎక్కువగా తాగుతున్నారు. రేట్లు పెంచటం వల్ల ఇంకా ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. దీంతో కుటుంబ పోషణకు వెచ్చించే మొత్తం తగ్గిపోతుంది. ఆభారమంతా మహిళలపై పడుతుంది. మద్యపానం వల్లనే మహిళలపై హింస, అఘాయిత్యాలు జరుగుతున్నాయి. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై హింస రోజురోజుకీ పెరుగుతుంది. గృహ హింస విషయంలో బాధిత మహిళలకు న్యాయం జరగట్లేదు. కొందరు రాజకీయ నాయకులు హింసకు పాల్పడిన వారితో కలిసి, బాధితులతో రాజీప్రయత్నాలు చేస్తున్నారు. నిందితులకు శిక్షలు పడట్లేదు.

ఐద్వా పోరు యాత్ర అభినందనీయం

మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలవడం ఆందోళన కలిగిస్తోంది

పి.బి విజయకుమారి, విశ్రాంత ఉద్యోగి, కొలకలూరు



ప్రజాశక్తి - తెనాలి

నిషేధిత గుట్కా, ఖైని, పాన్ పరాగ్ వంటి మత్తు పదార్థాల విక్రేతలు ప్రతిరోజు ఏదో ఒక మూల పట్టుబడటం పేపర్ల ద్వారా చూస్తేనే ఉన్నాం. ఇటీవల కాలంలో గంజాయి కూడా అధికమైంది. మరి ముఖ్యంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విద్యార్థులే లక్ష్యంగా విక్రయిస్తున్నారని ఇటీవల కాలంలో పోలీసులు వెల్లడిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారింది. లక్షలాది రూపాయలు వెచ్చించి ఉన్నత విద్య కోసం పిల్లలను పంపిస్తున్న తల్లిదండ్రులలో భయాందోళనలు నెలకొంటు న్నాయి. దీనికి తోడు గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అని తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ అనధికార మద్యం విక్రయాలు కూడా జరుగుతున్నాయి. ఇవి కూడా యువతపై కొంత ప్రభావాన్ని చూపుతుందనటంలో సందేహం లేదు. ఇలాంటి వాటిని అరికట్టడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి. ఐద్వా ఆధ్వర్యంలో మద్యం, మత్తు పదార్థాలు నిషేధించాలని, హింస నివారణకు చర్యలు తీసుకోవాలని పోరు యాత్ర చేపట్టడం అభినందనీయం.

బహిరంగ సభలను జయప్రదం చేయండి : ఐద్వా

ప్రజాశక్తి - గుంటూరు : మహిళలపై హింసను అరికట్టాలని, మద్యం, మత్తుపదార్థాలను నియంత్రించాలని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మహిళల పోరు యాత్రను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. పద్మ, ఎల్. అరుణ ఒక ప్రకటనలో కోరారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు యాత్ర గుంటూరు జిల్లాకు ప్రవేశిస్తుందని , శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బహిరంగ సభ జరుగుతుందని మహిళలు, శ్రామిక మహిళలు, మధ్యతరగతి మహిళలు, కాలేజీ విద్యార్థినిలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట: హిందూపురం నుండి ప్రారంభమైన పోరుయాత్ర చిలకలూరిపేట పండరిపురం ప్రజాసంఘాల కార్యాలయానికి సోమవారం ఉదయం వస్తుందని ఐద్వా పట్టణ కార్యదర్శి పి భారతి తెలిపారు. పట్టణములో పోరుయాత్ర ఎన్నార్టీ సెంటర్ నుండి చౌత్రా సెంటర్ మీదుగా, పాత పోలీస్ స్టేషన్ నుంచి 12వ వార్డులో ఉన్న చంద్రమౌళి పార్కువరకు జరుగుతుందన్నారు. నందిపాడు రోడ్డులోని కాకతీయ జూనియర్ కాలేజీలో, కళామందిర్ సెంటర్ వద్ద బహిరంగ సభలు నిర్వహిస్తారని ఆమె తెలిపారు. కార్యక్రమాలలో అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం కార్మికులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

మహిళా రక్షణ చట్టాన్ని తీసుకురావాలి

గాయత్రి, మంగళగిరి



మహిళలపై రోజురోజుకు జరుగుతున్న దాడులను అఘాయిత్యాలను అరికట్టడానికి మహిళా రక్షణ చట్టాన్ని కూడా తీసుకురావాల్సిన అవసరం ఉంది. సమాజంలో ఉన్న ప్రజల్లో కూడా మహిళల పట్ల గౌరవం పెరగాలి, అందుకు వివిధ రూపాల్లో అవగాహన సదస్సులు జరపవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మహిళలు ఒంటరిగా తిరగడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు సరైన చట్టాలు చేయాలని, చేసిన చట్టాలను అమలు చేయాలని కోరారు . మత్తు పదార్థాలు విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

మత్తుతో యువత జీవితాలు చిత్తు

కొల్లి శ్రీదేవి, ఉపాధ్యాయురాలు, మంగళగిరి



మద్యం వలన అనేక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. మద్యపానాన్ని ప్రభుత్వాలు నిషేధించాలి. మత్తు పదార్థాల వలన యువత జీవితం చిన్నాభిన్నం అయిపోతుంది. మత్తు పదార్థాలు తయారీదారులపై పాలకులు కఠిన చర్యలు తీసుకోవాలి. యువత మత్తు పదార్థాలకు బానిస కావడానికి ఉపాధి లేకపోవడమే కారణంగా ఉంది. చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు లేకపోవడం వలన గంజాయి, పదార్థాలకు విక్రయాల్లో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. మత్తు పదార్థాల క్రయ, విక్రయాలపై పోలీసులు నిఘా పెంచాలి.

హింసను అరికట్టడంలో విఫలం

ఎల్.అరుణ, ఐద్వా గుంటూరు జిల్లా కార్యదర్శి



దేశంలో, రాష్ట్రంలో మహిళలపై రోజురోజుకూ హింస పెరుగుతుంది. దేశ ప్రతిష్టను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన రెజ్లర్లకు సైతం లైంగిక వేధింపులు తప్పలేదు. మహిళలు, చిన్నారులపై హింసను అరికట్టంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. గుంటూరు జిల్లాలో బాపట్లలో తన అక్క జోలికి రావద్దని అడ్డుకునే ప్రయత్నం చేసిన బాలుడిని కిరాతకంగా పెట్రోలు పోసి తగులపెట్టారు. ఇటీవల తాడేపల్లిలో నిశ్చితార్థం అయిన మహిళపై అఘాయిత్యం జరిగింది. గుజరాత్ అల్లర్లలో బిల్కిస్ బానో ఘటనలో నిందుతులను సత్ప్రవర్తన పేరుతో విడుదల చేయటం విస్మయం కలిగిస్తుంది. ఇలాంటి ఘటనలు దేశాన్ని కలచి వేస్తున్నాయి. బిజెపి అధికారంలోకి వచ్చాక మహిళలపై హింస పెరిగింది. వీటిని ప్రభుత్వాలు పెడచెవిన పెడు తున్నాయి. కొన్ని సార్లు హింసను ప్రోత్సహించే విధంగా పాల కుల ప్రసంగాలు ఉంటున్నాయి. దిశ, నిర్భయ వంటి మహిళా చట్టాలు కాగితాలకే పరిమితం అయ్యాయి. రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అందుకు భిన్నంగా మద్యం విక్రయాలు పెంచింది. మత్తు పదార్థాలు అమ్మకాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నివారణ చర్యలు తీసుకోవట్లేదు.ఈ నేపథ్యంలో మహిళలు అంతా ఐక్యం అయి ఈ హింసను ఎదుర్కొనాలి. మహిళలా కేసుల పరిష్కారానికి ఫాస్ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి. మహిళలపై జరుగుతున్న హింసను అధ్యయనం చేయటానికి ఒక కమిటీ ఏర్పాటు చేయాలి.

మద్యం నిషేధించాలి

బి ఇంద్రాణి,అరవింద హైస్కూల్ ప్రిన్సిపల్



మద్యం మనిషిని మూర్ఖునిడిని చేస్తుంది. మనిషిలోని మంచిని దూరం చేస్తుంది. ఈ విషయాలు అందరికి తెలిసినా దాన్ని మాత్రం వదల్లేకపోతున్నారు. ప్రభుత్వం కూడా దశల వారీగా మద్యం నిషేధం అమలు చేయకపోవడం బాధాకరం. చిన్న వయసులోనే మద్యానికి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. ఇందుకు కుటుంబానికి, సమాజానికి నష్టం. ఈ దురలవాట్లకు అలవాడు పడిన వారు బయటపడటం కష్టం. పిల్లలు, యువకులు ఈ వ్యసనాల వల్ల బలైపోతున్నారు. మద్యపాన నిషేధం అమలు చేయడం అత్యవసరం.

మద్యంతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి

కె.జయలక్ష్మి, గృహిణి, గుంటూరు



మద్యం వల్ల కుటుంబాలు చిన్నబిన్నం అవుతున్నాయి. యువత పెడతోవ పడుతుంది. మైనర్లు కూడా మద్యం సేవిస్తున్నారు. మద్యం వల్లే చిన్నారులపై అఘాయిత్యాలు జరుగు తున్నాయి. మద్యం అలవాటుతో ఆర్థికంగా చితికిపోవటంతోపాటు, అనారోగ్యం బారిన పడి, చివరకు ప్రాణాలు కోల్పోతున్నారు. పాతగుంటూరు ప్రాంతంలో చిన్న చిన్న కుటుంబాల మగవారు అంతా ప్రతి రోజూ మద్యం తాగి ఇంటికి వస్తున్నారు. రోజు కూలి పనులు చేస్తున్నా వచ్చే డబ్బులు సగంపైగా మద్యానికి పోతున్నాయి. దీంతో మహిళలకు కుటుంబ పోషణ కష్టంగా మారుతుంది. మద్యాన్ని పూర్తిగా నిషేధించాలి.

మహిళలపై దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి

ఎమ్‌డి.షకీలాబేగం, టీచర్



రోజురోజుకూ మహిళలపై పెరుగుతున్న అత్యాచారం, హత్యలు చూస్తుంటే ఆందోళన కలుగుతుంది. ఆడవారిని సాటి మనుషులుగా కాక, లైంగిక వస్తువుగా చూడటమే దీనికి కారణం. ఇటీవల మణిపూర్‌లో జరిగిన హింసలో మహిళలను వివస్త్రన చేసి, హత్యగావించటం, అందులో మైనర్లు కూడా ఉండటం వారి పైశాచికత్వానికి నిదర్శం. బిల్కిస్ బానో కేసులో దోషులు సంస్కారవంతులంటూ విడు దల చేయటం అన్యాయం. దేశంలో ఒక మతాన్ని కించపర చాలంటే ఆ మతానికి చెందిన మహిళలపై అఘాయిత్యానికి పాల్పడాలని కొందరు నాయకులు పబ్లిక్‌గా మాట్లాడు తున్నారు. మతాలకు మహిళలను కొందరు ఛాందస వాదులు చిత్రీకరిస్తున్నారు.మహిళలకు దేశంలో రక్షణ కరువైంది. ఇలాంటి ధోరణులను ప్రతి ఒక్కరూ ప్రతిఘటిం చాలి. కనీసం భావి భారత పౌరులైన యువత స్త్రీ, పురుష సమానత్వం దిశగా పయనించాలి. ఈ సందర్భంగా ఐద్వా చేపట్టిన యాత్ర జయప్రదం కావాలని కోరుతున్నాము. మహిళా రక్షణ చట్టాలను అమలు చేయట 0లో పాలక వర్గాల చిత్తశుద్ధి లేమిని ఎత్తి చూపి, అంతరించిపోతున్న మానవత్వాన్ని యాత్ర తట్టి లేపాలి అని ఆశిస్తున్నాము.



విశాఖ జిల్లా నుండి ప్రారంభమైన పాదయాత్రలో పొలంలో కూలీలతో ఐద్వా నాయకులు



పోరుయాత్రలో విద్యార్థినులతో కలసి భోంచేస్తూ..



జులై 28న హిందూపురంలో ప్రారంభమైన ఐద్వాపోరుయాత్రలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి